10 YEAR ANNIVERSARY 2014 - 2024
పెన్ పవర్
తెలంగాణ రౌండప్
శుక్రవారం 22 నవంబర్ 2024 పేజీలు 8

# ఈ సంస్థ ద్వారా రానున్న మూడేళ్ళలో 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు

- రఘువంశీ ఏరోస్పేస్ కొత్త కారాగార నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన
- శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లో శంకుస్థాపన చేసిన మంత్రి
- నూతన ఎంఎస్ఎంఈ విధానం ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రోత్సాహకాలు ఇస్తామన్న మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:**రఘువంశీ ఏరోస్పేస్ సంస్థ రానున్న మూడేళ్లలో 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. శంషాబాద్ ఏరో స్పేస్ పార్క్‌లో రఘువంశీ ఏరోస్పేస్ కొత్త కర్మాగార నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎంఎస్ఎంఈ విధానం ద్వారా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. రూ. 300 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కర్మాగారాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. రఘువంశీ ఏరోస్పేస్ ఎయిర్ బస్, బోయింగ్‌తో పాటు పలు ప్రముఖ విమాన ఇంజిన్ల తయారీ సంస్థలకు కీలకమైన విడిభాగాలను సరఫరా చేస్తోందన్నారు. 2002లో చిన్న పరిశ్రమగా ప్రారంభమైన రఘువంశీ ఏరోస్పేస్ ఇప్పుడు ఈస్థాయికి ఎదిగి రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింప చేసిందన్నారు. డీఆర్డీవో, ఇస్రో, హెచ్ఏఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి సంస్థలకు పరికరాలను, విడిభాగాలను అందిస్తోందన్నారు.

# దేశానికి తెలంగాణ మోడల్‌గా కులగణన



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశానికి తెలంగాణ మోడల్ గా కులగణన జరుగుతుందన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. గాంధీభవన్ లో పార్టీ కార్యకర్తలు, మంత్రులతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ప్రజా సమస్యలను రిష్కరించేందకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలతో సీఎం, మంత్రులు మమేకం అవుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. విద్యా,ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రధాన దృష్టి పెట్టింద న్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే వేలాది ఉద్యోగాల భర్తీ చేపట్టామన్నారు భట్టి విక్రమార్క. సమాజంలో సగభాగమైన మహిళలలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు ఇస్తున్నామన్నారు. రాహుల్ పిలుపు మేరకే రాష్ట్రంలో కులగణన చేస్తున్నామని చెప్పారు. దీనిపై కొందరు రాజకీయ నాయకులు దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

# లగచర్ల ఘటనను సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల కమిషన్... సీఎస్, డీజీపీకి నోటీసులు

- 2 వారాల్లో పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశాలు
- లగచర్లకు అధికారుల బృందాన్ని పంపించనున్నట్లు వెల్లడి
- ఈ నెల 18న ఎన్‌హెచ్ఆర్‌సీకి బాధితుల ఫిర్యాదు



**హైదరాబాద్ పెన్ పవర్:**వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) సుమోటోగా స్వీకరించిం ది. తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశిం చింది. అలాగే తమ అధికారుల బృందాన్ని లగచర్లకు

-2లో

# లంచం.. లంచం.. ఏసీబీకి పట్టుబడిన ప్రభుత్వ ఉద్యోగులు

-2లో



# హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, కేంద్రమంత్రులు
- నేరుగా రాజ్ భవన్ చేరుకున్న ద్రౌపది ముర్ము
- నేడు లోక్ మంథన్-2024లో పాల్గొననున్న ద్రౌపది ముర్ము

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. వివిధ అధికారిక కార్యక్రమాలలో హాజరయ్యేందుకు ఆమె నగరానికి వచ్చారు. హైదరాబాద్‌లో జరుగుతున్న కోటి దీపోత్సవానికి కూడా ఆమె హాజరుకానున్నారు. సాయంత్రం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క తదితరులు ఘనస్వాగతం పలికారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కూడా ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.బేగంపేట విమానాశ్రయం నుంచి ఆమె నేరుగా రాజ్ భవన్ చేరుకున్నారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకొని ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవానికి వెళ్లనున్నారు. నేడు శిల్పకళా వేదికలో జరుగుతోన్న లోక్ మంథన్-2024 కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఆమె ఢిల్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నగరంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# లంచం.. లంచం.. ఏసీబీకి పట్టుబడిన ప్రభుత్వ ఉద్యోగులు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏసీబీ అధికారులు ఎప్పటికప్పుడు అవినీతి తిమింగలాలను పట్టుకొని జైలుకు తరలిస్తున్నా ఇతర ప్రభుత్వ ఉద్యోగుల్లో మాత్రం చలనం రావడం లేదు. చేతులు తడవనిదే ఫైళ్లు కదలవు అన్నట్లుగా కాసులకు కక్కుర్తి పడుతున్నారు. పక్కా ఆధారాలతో బాధితులు అవినీతి నిరోధక శాఖ అధికారులనుసంప్రదిస్తుండడంతో వారి పాపం పండుతోంది. తాజాగా, ఒకేరోజు ఇద్దరు అవినీతి ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీ వలకు చిక్కారు. సంగారెడ్డి జిల్లా, సదాశివపేట మండలంలోని ఆత్మకూర్ గ్రామం పంచాయితీ కార్యదర్శి సచిన్ కుమార్ రూ. 10వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఫిర్యాదుదారు తన ఇంటికి నెంబర్ కేటాయించాలని పంచాయితీ కార్యదర్శి సచిన్‌ను సంప్రదించగా.. అతను రూ.30వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు అంత ఇచ్చుకోలేనని అనడంతో ఆ మొత్తాన్ని రూ.15వేలకు తగ్గించాడు. అందులో భాగంగా మొదటి విడతగా రూ. 10వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

**నక్ష కోసం రూ. 20 వేలు లంచం డిమాండ్..**

మరో ఘటనలో మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో రూ.20 వేలు లంచం తీసుకుంటూ సీనియర్ డ్రాఫ్ట్‌మెన్ జ్యోతీక్షేమాబాయి ఏసీబీకి చిక్కింది. వరంగల్ జిల్లాకు చెందిన ఓ పిర్యాదుదారు వ్యవసాయ భూమికి సంబంధించి నక్షకు దరఖాస్తు చేయగా.. జ్యోతీక్షేమాబాయి




రూ. రూ.20 వేలు ఇస్తేనే మ్యాప్ వస్తుందని చెప్పింది. ఫిర్యాదుదారు లంచం ఇవ్వడం ఇష్టం ఏసీబీ అధికారులను సంప్రదించడంతో ఆమె అవినీతి బాగోతం బయటపడింది.ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే 1064 నంబర్ ను సంప్రదించాలని ఏసీబీ అధికారులు ప్రజలకు సూచించారు. ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# లగచర్ల ఘటనను సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల కమిషన్... సీఎస్, డీజీపీకి నోటీసులు

- మొదటి పేజి తరువాయి

పంపించాలని కూడా నిర్ణయించింది.ఫార్మా కంపెనీ భూనిర్వాసితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 18న ఢిల్లీలో మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న మానవ హక్కుల కమిషన్ ఈ నోటీసులు జారీ చేసింది.వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీకి భూమి ఇవ్వడానికి నిరాకరిస్తూ రైతులు ఆందోళన చేస్తున్నారని, బాధితుల్లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఉన్నారని జాతీయ మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వడానికి నిరాకరిస్తున్న నేపథ్యంలో పోలీసులు తమను వేధిస్తారనే భయంతో చాలామంది గ్రామస్థులు ఊరి నుంచి బయటకు వచ్చి ఉంటున్నారని పేర్కొంది. ఈ నేపథ్యంలో, రెండు వారాల్లో పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపింది.

# అమీన్ పూర్ మున్సిపాలిటీలో ఏసీబీ సోదాలు






**హైదరాబాద్ పెన్ పవర్:**సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మున్సిపాలిటీలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఇటీవలే అమీన్ పూర్ మండలంలోని ఆరు గ్రామాలు మున్సిపాలిటీలో కలిసిన విషయం తెలిసిందే.. అందులోని ఐలాపూర్ గ్రామానికి సంబంధించిన గ్రామ సెక్రటరీ సంఘరీ సచిన్ కుమార్.. ఇంటి నెంబర్ విషయంలో డబ్బులు డిమాండ్ చేయగా బాధితులు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో అమీన్ పూర్ మున్సిపాలిటీ ఆఫీసుకు చేరుకుని సోదాలు చేశారు ఏసీబీ అధికారులు.

**20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీనియర్ డ్రాఫ్ట్ మాన్**

మరో వైపు మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో సర్వే, భూమి రికార్డుల అధికారి కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించగా రూ.20 వేలు లంచం తీసుకుంటూ ACBకి దొరికారు సీనియర్ డ్రాఫ్ట్ మాన్ (SDM) అధికారి జ్యోతి. దీనిపై విచారణ కొనసాగుతోంది.

# తెలంగాణలో పవర్ వార్.. ఏపీలో టామ్ అండ్ జెర్రీ షో




**హైదరాబాద్, నవంబర్ 21 పెన్ పవర్:**తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన రాజకీయాలు జరుగుతున్నాయి. ఆరు నెలల వ్యవధిలో రెండు రాష్ట్రాల్లో అధికార పార్టీలో ప్రతిపక్షానికి పరిమితమయ్యాయి. ఇక ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో రాజకీయాలు మారిపోయాయి.రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆరు నెలల వ్యవధిలో అధికార మార్పిడి జరిగింది. ప్రజలు అధికారంలో ఉన్నవారిని ప్రతిపక్షంలో.. ప్రతిపక్షంలో ఉన్నవారిని అధికారంలోకి తెచ్చారు. దీంతో రెండు రాష్ట్రాల్లోనూ రాజకీయాలు మారిపోయాయి. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి జరిగిగింది. ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాజకీయాలు, విధ్వంసాలు జరిగాయి. ఇక ప్రభుత్వాలు మారిన తర్వాత రాజకీయలు, అభివృద్ధి కూడా తారుమారైంది. ఇప్పుడు రేవంత్ సర్కార్ తెలంగాణలో రాజకీయాలు చేస్తుంటే.. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిపెట్టింది.తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభంలో గుడ్ సీఎంగా గుర్తింపు తెచ్చుకున్నారు. సమష్టి నిర్ణయాలు, అందరినీ కలుపుకుపోయే తత్వంతో ఆయనకు మంచి మార్కులే పడ్డాయి. అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను కట్టడి చేయడంలో ఇప్పుడు తడబడుతున్నారు. బీఆర్ఎస్ దూకుడును అడ్డుకోవడంలో రేవంత్‌తోపాటు, ఆయన మంత్రులు కూడా వెనుకబడుతున్నారు. ఒఏసారి నాలుగైదు కేసుల విచారణ జరుగుతున్నా.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఏమాత్రం బెదరడం లేదు. రేవంత్‌రెడ్డిపై ఎదురుదాడి చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేస్తున్నారు. హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన పేరిట ఇళ్లు కూల్చడం రేవంత్ సర్కార్‌కు మైనస్‌గా మారాయి. పరిశ్రమలు, పెట్టుబడులు సాధించకపోవడంతో బీఆర్ఎస్ నేతలు రేవంత్‌ను టార్గెట్ చేస్తున్నారు. తాజాగా రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో పార్మా కంపెనీకి భూసేకరణ విషయం బీఆర్ఎస్‌ను అడ్వాంటేజ్‌గా తీసుకుంది. దాడిచేసింది బీఆర్ఎస్ నేతలే అయినా.. మళ్లీ తమకే దెబ్బతాకినట్లు ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రపతికి ఫిర్యాదు చేసే ఆలోచనలో కూడా ఉన్నారు.ఇక టీడీపీ?బీజేపీ?జనసేన నేతృత్వంలో ఏపీలో ఏర్పడిన కూటమి ప్రభుత్వ పాలనలో ఏపీలో అభివృద్ధి ఊపందుకుంది. గత విధ్వంసం నుంచి ఏపీ రికవరీ అవుతోంది. ఇదే సమయంలో కూటమి సర్కార్ వైసీపీ నేతలను ఓ ఆటాడుకుంటుంది. టామ్ అండ్ జెర్రీలా రెండు పార్టీల మధ్య రాజకీయాలు సాగుతున్నాయి. తెలంగాణలో వైసీపీకి ఎమ్మెల్యే బలం ఉంది. కానీ ఏపీలో వైసీపీకి ఆ అవకాశం లేకుండా పోయింది. దీంతో వైసీపీని అధికార టీడీపీ తరుముతోంది.

# అదానీ లంచం స్కాంలో.. అప్పటి జగన్ ప్రభుత్వ అధికారులు



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను కుదిపేస్తున్న అదానీ లంచాల కేసు.. ఇప్పుడు ఏపీ రాష్ట్రాన్ని తాకింది. విద్యుత్ ఒప్పందాలు, గ్రీన్ ఎనర్జీ, పవర్ ప్రాజెక్టుల్లో అధిక లాభాల కోసం దేశంలోని పలువురు అధికారులకు 2 వేల 100 కోట్ల రూపాయలు లంచాలు ఇచ్చినట్లు అమెరికా ఏజెన్సీలు బయటపెట్టిన సంగతి తెలిసింది.
ఆ ఏజెన్సీ తన అభియోగ పత్రంలో అప్పట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వంలోని అధికారులను సైతం ప్రస్తావించింది. ఏపీలో విద్యుత్ ఒప్పందాల్లో భాగంగా.. 200 మిలియన్ డాలర్లు.. అంటే 1680కోట్ల రూపాయలు ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు.. అదానీ నుంచి లంచం తీసుకున్నట్లు అదానీపై నమోదైన అభియోగ పత్రంలో ప్రస్తావించారు.
2021లో %ూజుజ×%తో విద్యుత్ సరఫరా ఒప్పందానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు అదానీ గ్రీన్ నుండి %వి%200 మిలియన్ల మేరకు లంచాలు అందుకున్నారని అమెరికాలోని బ్రూక్లిన్‌లోని ఫెడరల్ కోర్టులో ఆరోపించారు. 2019–24లో అధికారంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది.
నేరారోపణ ప్రకారం..గౌతమ్ అదానీ 2021 ఆగస్టులో అప్పటి ఏపీ సీఎం జగన్ రెడ్డితో వ్యక్తిగతంగా సమావేశమయ్యారు .విద్యుత్ సరఫరా ఒప్పందం , రాష్ట్ర ప్రభుత్వం 7000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు కోసం ఒప్పందం కుదుర్చుకోవడానికి
అవసరమైన లంచాల గురించి చర్చించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ అధికారులకు లంచం ఇస్తానని కూడా అదానీ వాగ్దానం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# కొత్తగా పెళ్లయిన వారికి... ఈ వస్తువులు అస్సలే ఇవ్వొద్దట!

- **వాస్తు శాస్త్రం ప్రకారం కొన్ని రకాల బహుమతులు ఇస్తే మంచిది కాదంటున్న నిపుణులు**
- **ముఖ్యంగా ఏడు వస్తువులు వద్దని సూచనలు**
- **ఇదొక నమ్మకం మాత్రమేనని... ఇష్టమైతేనే అనుసరించవచ్చని స్పష్టీకరణ**



**హైదరాబాద్ పెన్ పవర్:**స్నేహితులు, బంధువులు, కొలీగ్స్... ఇలా ఎవరో ఒకరి ఇళ్లలో పెళ్లి జరిగితే హాజరవుతూ ఉంటాం. మన తాహతుకు తగినట్టుగా ఏదో ఒక బహుమతి ఇస్తూ ఉంటాం. ఇది మామూలు విషయమే. కానీ వాస్తు శాస్త్రం ప్రకారం కొన్ని రకాల బహుమతులు ఇస్తే మంచిది కాదని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఏడు రకాల వస్తువులు బహుమతిగా ఇవ్వవద్దని సూచిస్తున్నారు. అయితే ఇది వాస్తు శాస్త్రాన్ని నమ్మేవారికి మాత్రమేనని... ఇష్టమైతేనే అనుసరించవచ్చని స్పష్టం చేస్తున్నారు.

**అద్దాలు (మిర్రర్స్)**

కొత్తగా పెళ్లయిన జంటలకు అద్దాలు బహుమతిగా ఇవ్వవద్దని వాస్తు శాస్త్రం చెబుతోందని నిపుణులు అంటున్నారు. అద్దాలు ఇగోను, మనుషుల మధ్య దూరాన్ని పెంచుతాయని... ఇరువురి మధ్య ఐక్యత కంటే, ఎవరికి వారే అనే తత్వం పెరుగుతుందని చెబుతున్నారు. అసలు వాస్తు శాస్త్రం ప్రకారం బెడ్ రూమ్ లలో, లివింగ్ ఏరియాలలో అద్దాలు పెట్టుకోకూడదని చెబుతోందని పేర్కొంటున్నారు.

**కాక్టస్ లు, ఇతర ముళ్ల మొక్కలు**

ఇటీవలి కాలంలో అందంగా, అలంకరణ కోసం కాక్టస్ ప్లాంట్లు పెట్టుకోవడం పెరిగిపోయింది. అలాంటి కాక్టస్ లు, ఇతర ముళ్ల మొక్కలను కొత్త జంటలకు బహుమతిగా ఇవ్వొద్దని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ఈ మొక్కల నుంచి నెగెటివ్ ఎనర్జీ వెలువడుతుందని... ఇళ్లలో పెట్టుకుంటే అనుబంధాలు దెబ్బతింటాయని పేర్కొంటున్నారు. ప్రశాంతత లేకుండా పోతుందని అంటున్నారు.

**నలుపు, ముదురు రంగు వస్తువులు**

నలుపు, దానికి దగ్గరగా ఉండే తీవ్ర ముదురు రంగులోని వస్తువులను కొత్త దంపతులకు బహుమతిగా ఇవ్వకూడదని వాస్తు నిపుణులు చెబుతున్నారు. అవి నెగెటివ్ ఎనర్జీని ఆకర్షిస్తాయని... దురదృష్టానికి కారణమవుతాయని పేర్కొంటున్నారు. అందువల్ల ఎరుపు, గులాబీ, పసుపు రంగులు, లేత రంగుల వస్తువులు గిఫ్ట్ గా ఇవ్వాలని సూచిస్తున్నారు.

**ఖాళీ కూజాలు, కుండల వంటివి...**

కొత్త దంపతులకు ఖాళీ కూజాలు, పూల కుండీల వంటి ఖాళీ అలంకరణ వస్తువులు బహుమతిగా ఇవ్వవద్దని... అవి ఒంటరితనానికి, లేమికి సూచనలు అని వాస్తు నిపుణులు అంటున్నారు. అవి దంపతుల మధ్య దూరాన్ని పెంచుతాయని పేర్కొంటున్నారు.
అలాంటివి బహుమతిగా ఇవ్వాలనుకుంటే... పూల బొకేలు, పూల మొక్కలు వంటివి పెట్టి ఇవ్వాలని సూచిస్తున్నారు.

**గడియరాలు, వాచీలు**

వాస్తు శాస్త్రం ప్రకారం గడియారాలు, వాచీలు వంటివి ప్రతిదీ అశాశ్వతం, సమయం గడిచిపోతోందని గుర్తు చేసేవని నిపుణులు చెబుతున్నారు. ఇవి బంధాలను బలహీనం చేస్తాయని అంటున్నారు. కావాలంటే ఫొటో ఫ్రేములు, జంటగా ఇచ్చే ఆభరణాలు వంటివి ఇవ్వాలని సూచిస్తున్నారు.

**ఒంటరి వస్తువులు, ఒంటరి చిత్రాలు...**

ఏవైనా ఒంటరిగా ఉన్న స్త్రీ, పురుషుల చిత్రాలు, ఒకే క్యాండిల్, ఒకే లైట్ వంటివి కొత్త దంపతులకు బహుమతిగా ఇవ్వవద్దని... అవి ఒంటరితనానికి, అసమతౌల్యానికి గుర్తు అని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా ఇస్తే స్త్రీ పురుషులు జంటగా, ప్రేమగా ఉన్న చిత్రాలు, జంటగా ఉండే వస్తువులు ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇది దంపతుల మధ్య సాన్నిహిత్యం పెంచుతుందని వివరిస్తున్నారు.

## తిరుమల భక్తులకు పంగనామాలు పెట్టిన కిలాడి.. డబ్బు తీసుకుని ఎస్కేప్



**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుమల శ్రీవారి భక్తులకు ఓ మహిళ పంగనామాలు పెట్టింది. సుప్రభాత సేవ టిక్కెట్లు, వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లు, వీఐపీ గెస్ట్ హౌస్‌లో గదులు ఇప్పిస్తానని నమ్మించి బాధితుల నుండి డబ్బు తీసుకుని ఉడాయించింది. వివరాల ప్రకారం.. హైదరాబాద్ కి చెందిన వేంకటేశ్వర్ల అనే వ్యక్తికి ఓ మహిళ 5 సుప్రభాత సేవ టిక్కెట్లు, 6 వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లు, వీఐపీ గెస్ట్ హౌస్‌లో గదులు ఇప్పిస్తానని చెప్పింది. ఇందు కోసం రూ.41 వేల రూపాయలు ఖర్చు అవుతోందని చెప్పింది. మహిళను నమ్మిన వెంకటేశ్వర్లు ఆమెకు మొత్తం రూ.41 వేల రూపాయిలు ఇచ్చాడు. డబ్బు ఇచ్చినప్పటికీ మహిళా నుండి ఎలాంటి స్పందనకు లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన వేంకటేశ్వర్లు విజిలెన్స్ వింగ్ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు.. వెంకటేశ్వర్లను టికెట్ల పేరుతో మోసం చేసిన మహిళాను తిరుపతికి చెందిన పాత నేరస్థురాలు కె.నవ్యశ్రీగా గుర్తించారు. విజిలెన్స్ వింగ్ అధికారుల ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం నిందితురాలు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితురాలు నవ్యశ్రీ గతంలో రెండు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# ఉప్పల్‌లో నకిలీ ఆర్టీవో అధికారుల దందా..




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టీవో అధికారులమంటూ ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. బాధితులు కాంక్రీట్ మిల్లర్ల ఓనర్లు, మేస్త్రీలు ఉప్పల్ పోలీస్ స్టేషన్ ముందు గురువారం ఆందోళనకు దిగారు. ఆర్టీవో అధికారులమంటూ తమ బండ్లను ఆపి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని వాపోతున్నారు బాధితులు. ఈ దందా సంవత్సరకాలంగా జరుగుతుందట.

రోజుకు వేల రూపాయలు వసూళ్లు చేస్తూ.. అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంక్రీట్ మిల్లర్ల ఓనర్లు, మేస్త్రీలు ఈరోజు (నవంబర్ 21) ఉదయం నకిలీ ఆర్టీవో అధికారిని పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చారు. నకిలీ ఆర్టీవో ప్రేమ్ కుమార్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేలిన టీవీఎస్ ఎలక్ట్రిక్ స్కూటీ.. కొని మూడు నెలలే.. జగిత్యాలలో ఘటన



**హైదరాబాద్ పెన్ పవర్:** జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామంలో ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ పేలింది. బాలపల్లికి చెందిన భేతి తిరుపతి రెడ్డి మూడు నెలల క్రితం టీవీఎస్ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటీ కొనుగోలు చేశాడు. రోజూలానే ఇవాళ ఉదయం(గురువారం, నవంబర్ 21) తన ఇంటి కాంపౌండ్ లోపల ఎప్పటి లానే స్కూటర్‌కు చార్జింగ్ పెట్టి వేరే పనుల్లో నిమగ్నమయ్యాడు. స్కూటీకి చార్జింగ్ పెట్టిన కొద్దిసేపటికి బ్యాటరీ పేలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో ఇంటి తలుపులు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. స్కూటీ పూర్తిగా కాలిపోయింది. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపులోకి తెచ్చారు.తెలంగాణ ప్రభుత్వం కాలుష్యాన్ని తగ్గించే సదుద్దేశంతో ఎలక్ట్రిక్ వాహనాలను కొనాలని పిలుపునిస్తున్న సమయంలో ఇలా ఎలక్ట్రిక్ స్కూటీలు పేలిపోతున్న ఘటన వెలుగులోకి రావడం ఆందోళన కలిగించే విషయం. లీటర్ పెట్రోల్ ధర 110 రూపాయలకు పైగానే ఉన్న ఈరోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు వైపు వాహనదారులు మొగ్గుచూపుతున్నారు. కానీ.. ఇలా అడపాదడపా ఎలక్ట్రిక్ స్కూటర్లు పేలిపోతున్న ఘటనలు కొనుగోలుదారులను ఆలోచనలో పడేస్తున్నాయి.

## అమ్మ, నాన్నలకు సెల్యూట్..! పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఉద్వేగభరిత దృశ్యాలు

అమ్మ, నాన్నలకు సెల్యూట్..! పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఉద్వేగభరిత దృశ్యాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**పిల్లలు ప్రయోజకులైనప్పుడు తల్లిదండ్రుల గుండె సంతోషంతో ఉప్పొంగిపోతుంది. కొడుకు కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందడంతో ఆ పేదింటి తల్లిదండ్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. యూనిఫాంలో కొడుకును చూసేందుకు వచ్చారు. పరేడ్ పూర్తికాగానే తల్లిదండ్రుల దగ్గరకు వచ్చి తన టోపీని వారి తలకు పెట్టి సెల్యూట్ చేశాడో కానిస్టేబుల్.. ఆ క్షణం తల్లిదండ్రుల ముఖాల్లో ఆనందం తాండవించింది. మరో కానిస్టేబుల్ అభ్యర్థి తల్లి తలపై తన క్యాప్ పెట్టాడు.. తన చేతిలోని 303 రైఫిల్ ను తండ్రికి అందించి మైదానంలోనే పాదాభివందనం చేశాడు. ఈ ఉద్వేగభరిత దృశ్యాలను చూసిన పలువురు ఆనంద భాష్పాలు రాల్చారు.. ఈ దృశ్యాలు ఇవాళ జరిగిన పోలీసుల పాసింగ్ అవుట్ పరేడ్ లో కనిపించాయి.

# పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్... హైకోర్టులో భార్య శృతి పిటిషన్

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా అరెస్ట్ చేశారని శృతి పిటిషన్
- అరెస్ట్ చేసే సమయంలో నిబంధనలు పాటించలేదన్న పట్నం శృతి
- పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి





**హైదరాబాద్ పెన్ పవర్:**వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో తన భర్త పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేయడంపై ఆయన భార్య పట్నం శృతి హైకోర్టులో కోర్టు ధిక్కారణ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా తన భర్తను అరెస్ట్ చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒక వ్యక్తిని అరెస్ట్ చేసే సమయంలో అనుసరించే నిబంధనలు పాటించలేదన్నారు.ఈ సందర్భం గా డీకే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆమె తన పిటిషన్‌లో ఉదహరించారు. పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పిటిషన్‌లో ప్రతివాదులుగా ఐజీ వి.సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి, బొమ్మరాస్పేట ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్‌ను చేర్చారు.

**ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు: పబ్లిక్ ప్రాసిక్యూటర్**

తన అరెస్టును సవాల్ చేస్తూ పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. లగచర్లలో భూసేకరణకు వ్యతిరేకంగా ఆయన ప్రజలను రెచ్చగొట్టారని ఆరోపించారు. సంబంధిత వీడియోలను సీడీ రూపంలో కోర్టుకు అందించారు.

# అమెరికాలో కేసు ఎఫెక్ట్... అదానీని అరెస్ట్ చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్

- అదానీని ప్రధాని మోదీ కాపాడుతున్నాడని విమర్శ
- తక్షణమే జేపీసీతో విచారణ జరిపించాలని డిమాండ్
- శీతాకాల సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తుతామన్న రాహుల్ గాంధీ



**హైదరాబాద్ పెన్ పవర్:**అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. లంచం ఆరోపణలతో అదానీపై అమెరికాలో కేసు నమోదైంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ ఈరోజు మీడియాతో మాట్లాడుతూ... అదానీ అమెరికా, భారత్ చట్టాలను ఉల్లంఘించినట్లుగా తేలిపోయిందన్నారు. మోదీ-అదానీ బంధం భారత్‌లో ఉన్నంత వరకే సురక్షితమని వ్యాఖ్యానించారు.అమెరికాలో కేసు నేపథ్యంలో తక్షణమే జేపీసీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శీతాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామన్నారు. అదానీ తన అవినీతి ద్వారా దేశాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. అదానీని అరెస్ట్ చేయడంతో పాటు ఆయనను కాపాడుతున్న సెబి చీఫ్ మాధభి పురి బచ్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అయినా అదానీ అరెస్ట్ కాదని కచ్చితంగా చెప్పగలనని... ఎందుకంటే ఆయనను మోదీ కాపాడుతున్నారని ఆరోపించారు.

కాగా, భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకునేందుకు గౌతమ్ అదానీ, మరో ఏడుగురు కలిసి అధికారులకు లంచం ఆఫర్ చేసినట్లుగా అమెరికాలో కేసు నమోదైంది. రూ.2,000 కోట్లకు పైగా లంచం ఇవ్వజూపినట్లు అమెరికాలోని బ్రూక్లిన్‌లోని ఫెడరల్ కోర్టు అభియోగాలు మోపింది. అలాగే, బ్యాంకులు, ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు యత్నించినట్లు అమెరికా ఎఫ్‌బీఐ ఆరోపణలు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలో అదానీ షేర్లు భారీగా పతనమయ్యాయి.

# కొండా సురేఖ వ్యాఖ్యలతో నాగార్జున కుటుంబం మానసికంగా కుంగిపోయింది: న్యాయవాది

- పరువు నష్టం కేసులో వాదనలు వినిపించిన నాగార్జున తరపు న్యాయవాది
- మంత్రి పదవిలో ఉండి అలాంటి వ్యాఖ్యలు సరికాదని వెల్లడి
- కొండా సురేఖ కచ్చితంగా క్రిమినల్ చర్యలకు అర్హురాలేనని స్పష్టీకరణ



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ మంత్రి కొండా సురేఖ కామెంట్స్ వల్ల నాగార్జున కుటుంబం మానసికంగా కుంగిపోయిందని ఆయన తరపు న్యాయవాది అన్నారు. మంత్రిపై నాగార్జున వేసిన పరువు నష్టం దావాపై నాంపల్లి కోర్టులో ఈరోజు విచారణ జరిగింది. నాగార్జున దావా వేయడంతో కొండా సురేఖ తరపు న్యాయవాది గురుప్రీత్ సింగ్ కౌంటర్ దాఖలు చేశారు. దీంతో ఈరోజు విచారణ జరిగింది. నాగార్జున తరపున అశోక్ రెడ్డి వాదనలు వినిపించారు.నాగార్జునపై కొండా సురేఖ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని కోర్టుకు తెలిపారు. ఆ తర్వాత సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో మంత్రి పెట్టిన పోస్టును న్యాయవాది చదివి కోర్టుకు వినిపించారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కొండా సురేఖ కచ్చితంగా క్రిమినల్ చర్యలకు అర్హురాలు అన్నారు. ఈ కేసులో నాగార్జున, ఆయన కుటుంబ సభ్యుల వాంగ్మూలాన్ని కోర్టు ఇప్పటికే నమోదు చేసింది. ఆ తర్వాత కొండా సురేఖ కౌంటర్ దాఖలు చేశారు.నాగార్జునపై వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖ... ఆ తర్వాత క్షమాపణలు కోరుతూ ట్వీట్ కూడా చేశారు. తన వ్యాఖ్యల వల్ల మీరు గానీ, మీ అభిమానులు గానీ మనస్తాపానికి గురైతే బేషరతుగా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని, అన్యదా భావించవద్దని కొండా సురేఖ ఎక్స్ వేదికగా ఆ రోజే క్షమాపణలు చెప్పారు. ఈ ట్వీట్‌ను న్యాయవాది ఈరోజు కోర్టులో చదివి వినిపించారు.

# కన్నతల్లికి తిండి పెట్టని కొడుకు.. అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్ పెన్ పవర్:కన్న తల్లికి తిండి పెట్టని వ్యక్తి పిన్నికి బంగారు గాజులు చేయిస్తానని చెప్పినట్లు సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఓవైపు గురుకుల విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో ఆసుపత్రిలో చేరుతుంటే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం మహిళలను కోటీశ్వరులను చేస్తానని ప్రగల్భాలు పలుకుతున్నాడని ట్వీట్ చేశారు. మాగునూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అస్వస్థతపై స్పందిస్తూ కేటీఆర్ ఈ ట్వీట్ చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం కూడా ఈ ప్రభుత్వం అందించలేకపోతోందని విమర్శించారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సరైన వసతులు కల్పించలేదని కేటీఆర్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆహారం వికటించి విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్నారని, రోజుకో పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 40



మందికి పైగా విద్యార్థులు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులు మరణిస్తున్నా సరైన చర్యలు తీసుకోకుండా పిట్టలదొర మాటలు చెబుతున్నాడంటూ రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆసుపత్రులలో, రైతులు జైళ్లలో, నిరుద్యోగులు రోడ్లపై ఆందోళనలలో ఉన్నారని చెబుతూ 'జాగో తెలంగాణ' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

- జుబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలిసిన టీటీడీ చైర్మన్
- సీఎంకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించిన సీఎం
- కేటీఆర్‌ను కలిసిన బీఆర్ నాయుడు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్ సీఎం నివాసంలో కలిశారు. రేవంత్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. శ్రీవారి ప్రసాదాన్ని అందించారు. ఇరువురు కాసేపు మాట్లాడుకున్నారు.తెలంగాణ భక్తుల దర్శనం కోసం తెలంగాణ ప్రజాప్రతినిధులు ఇచ్చే లేఖలను టీటీడీ పరిగణనలోకి తీసుకునే అంశంపై చర్చించి ఉంటారని భావిస్తున్నారు. బీఆర్ నాయుడు నిన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చే లేఖలను పరిగణలోకి తీసుకోవాలని కేటీఆర్ నిన్న విజ్ఞప్తి చేశారు. అలాగే తెలంగాణలోని దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## తెలంగాణ గ్రూప్ 2 హాల్ టికెట్ డౌన్ లోడ్.. ఎప్పటి నుంచంటే..!



హైదరాబాద్ పెన్ పవర్:గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తాజా అప్ డేట్ వెలువరించింది. అభ్యర్థులు వచ్చే నెల (డిసెంబర్) 9 నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. ఈమేరకు గురువారం టీజీపీఎస్సీ ఓ ప్రకటన విడుదల చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం 2 సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. కాగా, 783 గ్రూప్- 2 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగా.. 5.51లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

## 80 వేల చేరువలో బంగారం ధరలు

హైదరాబాద్ పెన్ పవర్:బంగారం ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంటాయి. ధరల్లో మార్పులు చేర్పులు చోటు చేసుకుంటాయి. నిత్యం బంగారం, వెండి ధరల్లో మార్పులు వినియోగదారులకు షాక్ ఇస్తున్నాయి. గత కొద్ది రోజులుగా బంగారం ధరలు పెరుగుతూనే పోతున్నాయి. మొన్నటి వరకూ తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మూడు రోజుల నుంచి పెరుగుతూ పోతుండటంతో ధరలు అందనంత పైకి ఎగబాకాయి. బంగారం తిరిగి పది గ్రాములు ఎనభై వేలకు చేరువలో ఉండగా, కిలో వెండి ధర లక్ష రూపాయలు దాటేసింది. దీంతో బంగారం, వెండి వస్తువులను కొనుగోలు చేయడంపై వినియోగదారులు ఒకింత డైలమాలో పడినట్లే కనిపిస్తుంది. కొనుగోళ్లు గతం కంటే మందగించాయి. నిజంగా ఈ సీజన్ లో కొనుగోళ్లు విపరీతంగా జరగాల్సి ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే తాము ఆశించిన రీతిలో అమ్మకాలు జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బంగారం, వెండి వస్తువులను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మదుపరులు కూడా ఇతర మార్గాలలో పెట్టుబడి పెట్టేందుకు ఎక్కువగా ఇష్టపడుతుండటంతో బంగారాన్ని కొనుగోలు చేసే వారు తక్కువయ్యారని వ్యాపారులు చెబు?తన్నారు. అయితే రానున్న కాలంలో బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత కొంత ధరలు తగ్గినా తిరిగి ధరలు పెరగడం కొంత ఆందోళన కలిగిస్తుంది.అదే బాటలో వెండి ధరలు ధరలు తగ్గినప్పుడే... బంగారం ధరలు తగ్గినప్పుడే కొనుగోలు చేయాలని చూసేవారు ఎక్కువ మంది ఉన్నారు. తక్కువ నగదుతో ఎక్కువ మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేయడానికే వినియోగదారులు ఇష్టపడతారు. అందుకే ధరలు పెరిగినప్పుడు సహజంగా కొనుగోళ్లు తగ్గుతాయి. ఈరోజు దేశంలో బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. వెండి ధరల్లో కూడా స్వల్పంగానే పెరుగుదల కనిపించింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో నేడు బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 71,160 రూపాయలుగా నమోదయింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 77,630 రూపాయలుగా కొనసాగుతుంది. కిలో వెండి ధర 100,900 రూపాయలకు చేరుకుంది. ఉదయం ఆరు గంటల వరకే ఈ ధరలు నమోదయ్యాయి.మధ్యాహ్నానికి ధరలు పెరగొచ్చు. తగ్గొచ్చు. స్థిరంగా కొనసాగవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

## మాగనూర్ స్కూలు ఘటన అధికారులపై వేటు

**నారాయణపేట పెన్ పవర్:** నారాయణపేట మాగనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ తో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురి అయిన సంఘటనకు బాధ్యులపై అధికారులు చర్యలు చేపట్టారు.... ఎంఈఓ మురళీధర్ రెడ్డి, సంఘటన జరిగే సమయంలో ఇన్చార్జిగా ఉన్న బాబు రెడ్డిని సస్పెండ్ చేయడంతో పాటు.. వంట ఏజెన్సీలను రద్దు చేస్తూ కలెక్టర్ సిక్త పట్నాయక్ ఆదేశాలు జారీ చేశారు..


ఫుడ్ పాయిజన్ అయ్యి వంద మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం.. అందులో 16 మంది పరిస్థితి విషమంగా ఉండడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారుల పై సీరియస్ అయ్యారు. ఈ మేరకు సీఎంఓ ఆదేశాలతో అధికారులు బాధ్యుల పై చర్యలు చేపట్టారు. సంఘటనకు సంబంధించి పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి పంపనున్నారు.......

## చత్తీస్-ఘడ్ ఒడిశా సరిహద్దుల్లో ఎదురుకాల్పులు.. ఒక మావోయిస్టు మృతి



**మల్కన్ గిరి పెన్ పవర్::** ఒరిస్సా మల్కనగిరి-ఛత్తీస్గఢ్ సుక్మా జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఒరిస్సాకు చెందిన భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్కౌంటర్ లో బడా నాయక్ అనే జవాన్ కు గాయాలు అయ్యాయి. మావోయిస్టులు రెండు రాష్ట్రాల సరిహద్దులోని శబరి నదిని దాటుతుండగా ఎదురు కాల్పులు జరిగాయి. ఘటనలోఒక మావోయిస్టు మృతి చెందినట్లు సమాచారం.

## మహబూబాబాద్ జిల్లాలో కొనసాగుతున్న 144 సెక్షన్ అమలు



**మహబూబాబాద్: పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతోంది. నలుగురు కంటే ఎక్కువ మంది గుమ్మిగూడి ఉండరాదని పోలీసులు ప్రకటించారు. పోలీస్ చట్టం అతిక్రమించినచో చట్టపరమైన చర్యలని హెచ్చరించారు. రహదారులపై,ముఖ్య కూడల్లపై పోలీసులు పహారా కాస్తున్నారు. మహబూబాబాద్ లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సుదీర్ రామ్ నాథ్ కేకన్ అన్నారు.

# మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేల మధ్య టఫ్ ఫైట్

**నిజామాబాద్, నవంబర్ 21, పెన్ పవర్:** ఆ జిల్లాలో ఓ పదవి కోసం ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య పోటాపోటీ నెలకొంది. ఒకరు తొలిసారి ఎమ్మెల్యేగా గెలవగా.. మరొకరు మంత్రిగా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉన్న ప్రజాప్రతినిధి. ముఖ్యమంత్రి సహా కొందరు సీనియర్లు ఆ మాజీ మంత్రికి జై కొడుతుంటే ఢిల్లీ పెద్దలు మాత్రం.. ఆ జూనియర్ వైపు మొగ్గు చూపుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. ఆ క్రమంలో ఆ ఇద్దరి మధ్య పొలిటికల్ ఫైట్ స్టార్ట్ అవ్వడంతో ఇద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు కాంగ్రెస్ పెద్దల ఫార్ములా ఓకే అయిందంట.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా హస్తం పార్టీలో.. మంత్రి పదవి కోసం ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య టఫ్ ఫైట్ నడుస్తుందట. బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు లు రేవంత్ క్యాబినెట్ లో బెర్త్ కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారట. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఖాయమన్న ప్రచారం జరిగింది. అయితే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ తన పేరు పరిశీలించాలంటూ రాహుల్ టీంతో ఒత్తిడి చేయిస్తున్నారట.దాంతో సుదర్శన్ రెడ్డి పేరు ఖరారైనా.. మదన్ మోహన్ ప్రయత్నాలతో అధికార ప్రకటనలకు తాత్కాలికంగా బ్రేక్ పడిందంటున్నారు. రాహుల్ టీం మదన్ మోహన్ పేరు సిఫార్సు చేస్తుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం సీనియర్ అయిన సుదర్శన్ రెడ్డి వైపు మొగ్గు చూపుతున్నారట. అదే ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య పొలిటికల్ ఫైట్‌కు కారణమైందంట. సీనియర్ ఎమ్మెల్యే.. జూనియర్ ఎమ్మెల్యే మధ్య రాజీ కుదుర్చేందుకు హస్తం నేతలు ప్రయత్నాలు చేస్తున్నా.. సమన్వయం కుదరటం లేదట. మంత్రివర్గ విస్తరణ జాప్యానికి.. ఇదో కారణంగా చెబుతున్నారు.మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డికి.. తొలి విడతలోనే మంత్రి పదవి వస్తుందని ప్రచారం జరిగినా.. మిస్ అయింది. సుదర్శన్ రెడ్డి సేవలను స్పీకర్ గా వినియోగించుకోవాలని పార్టీ పెద్దలు ప్రతిపాదిస్తే భావించినా.. ఆయన ససేమిరా అన్నారట. క్యాబినెట్ బెర్త్ కోసం పట్టుబట్టి .. అంతా ఓకే అనుకునే సమయానికి.. నేనున్నానంటూ తెరపైకి మదన్ మోహన్ వచ్చారట. రాహుల్ టీమ్‌తో రాయబారాలు నడిపారంట. దాంతోమంత్రి వర్గ విస్తరణ జరిగితే.. మదన్ పేరు పరిశీలించాలని ఢిల్లీ పెద్దలు చెప్పారట. దాంతో ఆ ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చిందట.ఐతే ఇటీవల పార్టీ పెద్దలు మదన్‌తో చర్చలు జరిపి చీఫ్ విప్ పదవి ప్రతిపాదన చేశారట. ఆ ప్రతిపాదనకు నో చెప్పలేక ఎస్ అనలేక సర్దుకుపోతా అని మదన్ సంకేతాలిచ్చారట. దీంతో సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి, మదన్‌మోహన్‌కు చీఫ్ విప్ పదవి దాదాపుగా ఖరారయ్యాయన్న ప్రచారం జరుగుతుంది. చీఫ్ విప్ అంటే క్యాబినెట్ హోదా లభిస్తుంది. ఇప్పుడు ప్రచారం జరుగుతున్నట్లు సీనియర్, జూనియర్‌లు ఇద్దరికీ పదవులు దక్కితే నిజామాబాద్ జిల్లాకు రెండు క్యాబినెట్ పదవులు దక్కుతాన్నమాట.. మరి ఆ లాంఛనం ఎప్పుడు పూర్తవుతుందో అని ఇద్దరు ఎమ్మెల్యేల అనుచరులు తెగ టెన్షన్ పడుతున్నారు.

# కొత్తగూడెంలో ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలని సంక్షేమ పథకాలు అమలు చేసి అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షులు రావుల హనుమంతరావు కోరారు.. ఈరోజు గురువారం ఖమ్మం జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ శతాబ్ది ఉత్సవాలు మరియు ప్రపంచ మత్స్య కారుల దినోత్సవం సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల వెంకట నరసయ్య ముదిరాజు గత పది సంవత్సరాలుగా ఆవిర్భావం నాటి నుండి నేటి వరకు ప్రభుత్వాన్ని మెప్పించి ఒప్పించి మత్స్యకారుల జీవితాలలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చిన సంఘం తెలంగాణ ముదిరాజ్ మహాసభ అని కొనియాడారు. ముదిరాజ్ మహాసభ సాధించినవి కొన్నే అయినా సాధించుకోవలసినవి ఎంతో ఉందన్నారు. ముదిరాజుల కులవృత్తి అయినటువంటి మత్స్యకారులుగా జీవనం సాగిస్తున్న ముదిరాజుల భవిష్యత్ తరాలపై ఆలోచన చేస్తూ ఇప్పుడు ఎదుగుతున్న యువతరాన్ని విద్య వైపు ఉన్నతమైన చదువుల వైపు దృష్టి పెట్టాలన్నారు. ఉన్నతమైన చదువులు చదువుతూ విద్యావంతులుగా సంపూర్ణత సాధించిన నాడే మన జీవితాలను రాజకీయంగా ఆర్థికంగా బలపరుచుకోగలమని ఎవరో వచ్చి మన జీవితాలను బాగు చేస్తారని ఆలోచన మానుకోవాలని ఇప్పుడు జరుగుతున్న కులగననలో జిల్లాలో ఉన్న ముదిరాజులందరూ ముతరాసి బంటు తెలుగు తెనుగోళ్ల గా పిలవబడుతున్న మనం ముదిరాజ్ అని కచ్చితంగా రాయించాలని మన సంఖ్యా బలాన్ని కాపాడాలని రాబోయే స్థానిక ఎలక్షన్లలో అవకాశం ఉన్న ప్రతి చోట సర్పంచులుగా ఎంపీటీసీలుగా ఆయా ప్రాంతాల రాజకీయ పార్టీ ఏదైనా మన వాళ్ళని పోటీ చేయించి వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేస్తూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ మరియు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె రాంబాబు ముదిరాజ్ కార్యదర్శి నార్ల శేషయ్య ముదిరాజ్, గౌరవ సలహాదారులు పగడాల మల్లేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు లింగనబోయిన లక్ష్మణ్ ముదిరాజ్, ఖమ్మం జిల్లా మత్స్య సొసైటీ డైరెక్టర్ తిప్పట్ల నరసింహారావు ముదిరాజ్, జిల్లా నాయకులు దొంద దర్గయ్య ముదిరాజ్, జిల్లా యూత్ నాయకులు తవడబోయిన కృష్ణా ముదిరాజ్, వెంగంపల్లి సురేష్ ముదిరాజ్, బోనకల్లు మండల కార్యదర్శి రెడ్డబోయిన ఉర్దండు ముదిరాజ్, కొత్తగూడెం మత్స్యశాఖ అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు ముదిరాజ్, కార్యదర్శి పోతురాజు వెంకటేశ్వర్లు ముదిరాజ్, ఉపాధ్యక్షులు పగడాల శ్రీనివాస్ ముదిరాజ్, చాగంటి శ్రీనివాస్ ముదిరాజ్, సభ్యులు బుడిగ ఉపేంద్ర ముదిరాజ్, కొత్తగూ డెం ముదిరాజ్ అధ్యక్షులు బుడిగ వెంకన్న ముదిరాజ్, కార్యదర్శి రావుల సంజీవరావు ముదిరాజ్, తదితర ముదిరాజు పెద్దలు పాల్గొన్నారు.

## కేసీఆర్ సైలెంట్ వెనక మర్మమేంటి..? రేవంత్ రెడ్డి మాటలు అర్థమేంటి..?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆయన మౌనం ఈయనకు కోపం తెప్పిస్తోంది ఫాంహౌ స్‌లో ఉంటావా ప్రజల్లోకి రా అంటూ గులాబీ దళప తికి సవాల్ చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఓడగొడితే ప్రజల ముఖం చూడవా? అంటూ ఇగోను టచ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. దమ్ముంటే అసెంబ్లీకి రావాలంటూ సవాల్ చేస్తున్నారు.

కేసీఆర్ మౌనం వెనక వ్యూహం ఉందా.? రేవంత్ మాటల్లో ఎత్తుగడ కనిపిస్తోందా.? కేసీఆర్ సైలెంట్‌గా ఉంటున్నారంటే ఏదో కథ ఉందని రేవంత్ ఆందోళన చెందుతు న్నారా.? లేక రెచ్చగొట్టి గులాబీ దళపతిని పబ్లిక్‌లోకి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారా.? అసలు తెలంగాణ గట్టు మీద సీఎం, మాజీ సీఎం లా ఎత్తు గడలు ఏమిటి? గులాబీ దళపతి ఇగోను టచ్ చేసి ప్రయత్నం.

మొన్నటి వరకు గులాబీ దళపతి మౌనం తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా కొనసాగింది. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి మాటలు టాక్ ఆఫ్ ది పాలిటిక్స్‌గా మారుతోంది. ఏడాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తోన్న సభల్లో బీఆర్ఎస్ అధినేతను టార్గెట్ చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి.

ఏకంగా కేసీఆర్ అనే మొక్క ను మళ్లీ మొలవనివ్వంటు న్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిస్తానని చెప్పి ఓడిం చా. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా సీట్లే అని చెప్పా చేసి చూపించా.. మళ్లీ చెప్తున్నా బీఆర్ఎస్ అనే మొక్కను మళ్లీ మొలకెత్తనివ్వను రాసి పెట్టుకోండి అంటూ సవాల్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డి

అంతేకాదు దమ్ముంటే అసెంబ్లీకి రావాలంటూ గులాబీ దళపతి ఇగోను టచ్ చేసి ప్రయత్నం చేస్తున్నారు సీఎం. కేసీఆర్‌ను రెచ్చగొట్టే ఎత్తుగడ, మౌనంగా ఫామ్ హౌస్‌లో పడుకుంటే నీ సంగతి తేలవదనుకోకు. నీ ముందు తెలుసు. నీ వెనక తెలుసు. నీ ఉపాయం తెలుసు. ఉబలాటం తెలుసు అంటున్నారు. రేవంత్ రెడ్డి.

మొన్నటి వరకు కేసీఆర్ ఎక్స్‌పైరీ మెడిసిన్ అన్న రేవంత్. ఇప్పుడు ఒక్కసారిగా బీఆర్ఎస్ అధినేత టార్గెట్ చేసి మాట్లాడటం హాట్ టాపిక్ అవుతోంది. అయితే కొన్నాళ్లుగా కేసీఆర్ మౌనంగా ఉంటున్నారు. అవసరమనిపిస్తే పార్టీ నేతలను ఫాంహౌస్‌కు పిలిచి మాట్లాడుతున్నారు.

ఈ మధ్యే పాలకుర్తి నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడిన గులాబీ బాస్ ఎక్కడా రేవంత్ పేరు ప్రస్తావించలేదు. ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది. ఫ్యూచర్ అంతా బీఆర్ఎస్‌దేనని చెప్పారు కేసీఆర్. రేవంత్ మాత్రం కేసీఆర్ చేసిన కామెంట్స్‌ను ప్రస్తావిస్తూ తెలంగాణ ఏం కోల్పో యిందో చెప్పాలంటూనే. పర్సనల్ అటాకింగ్‌కు దిగుతున్నారు.

దమ్ముంటే అసెంబ్లీకి రా అని సవాల్ చేయడం వెనక. కేసీఆర్‌ను రెచ్చగొట్టే ఎత్తుగడ ఉందన్న చర్చ జరుగుతోంది. వరంగల్ సభలో రేవంత్ చేసిన నాలుగు కామెంట్స్ చాలా ఇంట్రెస్టింగ్‌గా మారాయి. ఫాంహౌస్‌లో మౌనంగా పడుకుంటే నీ సంగతి తెల్వదనుకోకు. నీ ముందు తెలుసు. వెనక తెలుసు..నీ ఉపాయం, ఉబలాటం తెలుసు అన్నారు. కేసీఆర్ ఉపాయానికి తన దగ్గర విరుగుడు కూడా ఉందంటున్నారు రేవంత్ రెడ్డి.

అసలు కేసీఆర్ ఫాంహౌస్ లో ఏం చేస్తున్నారు? ఇదే ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. అందరు అనుకుంటున్నట్లే మౌనంగా ఉంటూ కేసీఆర్ తన పని తాను చేసుకుంటూ పోతున్నారా? కేసీఆర్ చేస్తున్న ఉపాయం ఏంటి? రేవంత్ మాటల్లో అర్థమేంటి.? ఇదే ఇప్పుడు తెలంగాణ గడ్డ మీద హాట్ టాపిక్‌గా మారింది..

# జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత తెలంగాణప్రభుత్వంలో నాయకత్వ మార్పిడి తథ్యం

**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్**



**హైదరాబాద్ పెన్ పవర్:** జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకత్వ మార్పిడి తథ్యమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన తీరు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టారు అందుకోసమే తన పదవి కాపాడుకునేందుకు, సోనియా గాంధీకి తనపట్ల నమ్మకం కలిగించుకునేలా ప్రసన్నం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి నానా రకాలుగా ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ సోనియా దేవత అంటూ.. ఆమె కాళ్లు కడిగి నీళ్లు నెత్తిమీద జల్లుకోవాలంటూ.. రాహులే దేశానికి సర్వస్వమంటూ భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అయినా, కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ ను నమ్మడం లేదనే విషయంలో అనేక అంశాల ద్వారా స్పష్టమవుతున్నదన్నారు. నిత్యం కాంగ్రెస్ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకోవడం, కప్పం కట్టడంపైనే రేవంత్ కాలం గడుపుతున్నారంటూ విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన తీరుపై ఎన్.వి.ఎస్.ఎస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.అసలు తెలంగాణ రాష్ట్రానికి రాహుల్ ముఖ్యమంత్రా.. లేక రేవంత్ రెడ్డా...? అన్న అనుమానం ప్రజల్లో నెలకొందని ఎన్.వి.ఎస్.ఎస్ విమర్శించారు. ఒకరోజు గడిస్తే చాలనే ఆలోచనలో రేవంత్ రెడ్డి..... హమ్మయ్య..! ఈరోజు గడిచిందనే భావనలో ప్రజలు ఉన్నట్లుగా అభివర్ణించారు. రేవంత్ రెడ్డి.. తన పదవిని కాపాడుకోవడానికే ప్రాధాన్యతనిస్తూ పాలనను గాలికొదిలేశారని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో ప్రభుత్వం ఎక్కడ తమ భూములను గుంజుకుంటుందోనని, ఇల్లు కూలగొడుతుందేమోననే భయంలో ప్రజలు ఉన్నారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే.. కూలగొట్టడం, కొల్లగొట్టడం.. దోచుకోవడం, దాచుకోవడం.. భూములు అమ్మడం, బీర్లు అమ్మడమేనా అంటూ ఎన్.వి.ఎస్.ఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల కోసం పాలన చేయకుండా ఇతర రాష్ట్రాల్లో రాజకీయాల కోసం, ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశాలను మెరుగుపర్చుకోవడం కోసం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రయోగశాలగా మార్చుకున్నారంటూ ఆరోపించారు. ఏడాది కాలం నుంచి మంత్రివర్గ విస్తరణ చేసి, కీలక శాఖలను తనవారికి అప్పజెప్పాలని పదేపదే కేంద్రాన్ని ప్రాధేయపడుతున్నా రేవంత్ కు అనుమతి ఇవ్వడం లేదు.రాష్ట్రాన్ని పాలిస్తున్నది ఎవ్వరనేది తెలంగాణ ప్రజల్లో సంశయం నెలకొంది.వీసీల నియామకం కావాలన్నా.. కార్పొరేషన్ల నియామకం జరగాలన్నా.. పదాధికారుల నియామకం జరగాలన్నా, మంత్రివర్గ విస్తరణ చేయాలన్నా ఫైలు పట్టుకుని ఢిల్లీకి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కాంట్రాక్టు రాహుల్ గాంధీ చెప్పినట్లుగానే రేవంత్ ముందుకెళు తున్నడు.కులగణన, రైతు రుణమాఫీతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాల విషయంలో అదే తంతు నడుస్తున్నది.అసలు తెలంగాణ రాష్ట్రానికి రాహుల్ ముఖ్యమంత్రా.. లేక రేవంత్ రెడ్డా...?రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇయ్యలేదు.ఒక్క విద్యార్థికి కూడా ఫీజు రీయింబర్స్ మెంట్ చేసిన దాఖలాల్లేవు.ప్రభుత్వ బకాయిల కారణంగా ఏ ప్రైవేటు ఆసుపత్రిలో కూడా ఆరోగ్య శ్రీ ని సక్రమంగా అమలు చేయడం లేదు. దీనిపై సర్కారు కనీసం సమీక్షించలేదు.ప్రభుత్వం రైతు రుణమాఫీ చెల్లించదని చెప్పి.. రైతులకు బ్యాంకు అధికారులు పాసుపుస్తకాలు తిరిగి ఇచ్చిన దాఖలాలు ఎక్కడైనా కనపడుతోందా..? ఇందిరమ్మ రాజ్యమంటే.. కూలగొట్టడం, కొల్లగొ ట్టడం.. దోచుకోవడం, దాచుకోవడం. భూములు అమ్మడం, బీర్లు అమ్మడంకోసమేనా..?కాంగ్రెస్ సర్కారు భయానక పాలనలో రాష్ట్రంలో ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బతుకు వెల్లదీస్తున్నరు.కాంగ్రెస్ సర్కారు ఏ రోజు తమ భూములు గుంజుకుంటుందో.. ఇల్లు కూలగొడుతుందేమోననే భయంతో రోజులు గడుపుతున్న పరిస్థితి ఏర్పడింది.రేవంత్ రెడ్డి గత ఎన్నికల సమయంలో దేవుళ్లపై ఒట్టు పెట్టి గట్టెక్కే విధంగా ఓట్లు దండుకుని పబ్బం గడుపుకున్నాడు.ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ పథకాలు అమలు కాలే.. రుణమాఫీ అమలు కాలే.. ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు కాలేదు.దేవుడికి ఆగ్రహం వస్తుందేమోనని, తన పీఠం కదులుతుందేమోననే భయంతో రేవంత్ ఒక్కో దేవాలయాన్ని సందర్శిస్తున్నడు.మొన్న వేములవాడ, యాదాద్రి ఆలయాలను సందర్శించి చేసిన తప్పులకు చెంపలు వేసుకుని, గుంజీలు తీశాడు.మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో మన తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కాంగ్రెస్ నాయకులు తెలంగాణను ఉద్ధరించామని చెప్తూ ప్రచారానికి వెళ్లారు.జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకత్వ మార్పిడి తప్పదు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి కావొస్తున్న తరుణంలో కనీసం మంత్రివర్గ విస్తరణ జరుపుకోలేని ముఖ్యమంత్రి పాలన సాగించడం ఎందుకన్నట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నరు.ఇచ్చిన హామీలు నెరవేర్చని ముఖ్యమంత్రి ఎవరి కోసం పాలన కొనసాగిస్తున్నట్లు అని ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

# ఎస్సీ వర్గీకరణ అమలు కోసం పోరాటమే మార్గం..

**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బెజ్జంకి అనిల్ మాదిగ**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎస్సీ వర్గీకరణను అమలు చేసి దేశంలోనే తెలంగాణను తొలి రాష్ట్రంగా నిలబెడుతామని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆ మాటను వంద రోజులు గడిచినా నిలబెట్టుకోలేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బెజ్జంకి అనిల్ మాదిగ అన్నారు.జమ్మికుంట మండలం ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం తునికి వసంత్ మాదిగ, అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బెజ్జంకి అనిల్ మాదిగ మాట్లాడుతూ "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకురావడంలో జాప్యం చేస్తున్నారని అన్నారు. కొంత మంది మాల ఎంఎల్ఏ లు కాంగ్రెస్ పార్టీ విధానాన్ని , రేవంత్ రెడ్డి, ఇచ్చిన ప్రకటనను చేవెళ్ళ డిక్లరేషన్ ను ధిక్కరించి మాట్లాడుతున్న వారిని కాంగ్రెస్ పార్టీ నుండి ఎందుకు సస్పెండ్ చేయడం లేదు అని ప్రశ్నించారు.ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి , కేఆర్ నాగరాజులు పెడుతున్న సభల వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రొత్బలం ఉందని అన్నారు. మాలల మాట విని ఎస్సీ వర్గీకరణ లేకుండానే టిచర్ ఉద్యోగాలు భర్తీ చేసి రేవంత్ రెడ్డి మాదిగ జాతికి ద్రోహం చేశాడని అన్నారు. అసెంబ్లీలో ఇచ్చిన మాటకే కట్టుబడి లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాదిగ ప్రజల్లో విశ్వాసం కోల్పోయాడని అన్నారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మరో పోరాటానికి మాదిగ ప్రజలు సిద్దం కావాలని పిలుపునిచ్చారు.